ప్రజాశక్తి

ఆదివారం 12 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు

పటిష్ట పోలీస్ భద్రత : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈనెల 13న శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో తీసుకున్న భద్రతా ఏర్పాట్ల గురించి శనివారం ఎస్‌పి తెలిపారు. జిల్లాలోని 13 మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. అందుకోసం గ్రాడ్యుయేట్ ఓటర్లకు 27 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్ ఓటర్లకు 13 పోలింగ్ కేంద్రాల కలిపి మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు అడిషనల్ ఎస్‌సి, ఇద్దరు డిఎస్‌పిలు, 8 మంది ఇన్‌స్పెక్టర్లు, 40 మంది ఎస్‌ఐలు, 20 మంది ఎఎస్‌ఐలు, 95 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 367 మంది కానిస్టేబుళు ,, 68 మంది హెచ్‌జిలు, 98 మంది ఆర్మ్‌డ్ ఫోర్స్ కలిపి మొత్తం 697 మంది పోలీస్ సిబ్బంది, అధికారులతో పాటు 3 సెక్షన్ల ఎపిఎస్‌పి బలగాలను ఎన్నికల కోసం వినియోగిస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వై లెన్స్ టీమ్‌లను నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 6 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు జరిగే రోజున 13 స్ట్రైకింగ్ పార్టీలను, 3 స్పెషల్ స్ట్రైకింగ్ పార్టీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు, రాజకీయ పక్షాల నాయకులు, ఓటర్లు గొడవలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని ఎన్నికల అధికారి ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్

▶ 2లో

ముగిసిన ప్రచారం.. పంపిణీలు..

- ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుదిదశకు
- పిడిఎఫ్‌కు రెండో ఓటేయాలని టిడిపి పిలుపు
- ఏర్పాట్లపై అధికారుల తలమునకలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుదిదశకు చేరుకుంది. మరో ఒక్కరోజే మిగిలింది. 13న జరిగే పోలింగ్‌కు అధికారులు కూడా అంతా సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పత్రాలు, బాక్సులు అన్ని సిద్ధం చేశారు. తరలింపు ఏర్పాట్లలో ఉన్నారు. శనివారంతో ప్రచారం ముగిసింది. పంపిణీలు కూడా ముగిశాయి. పాలకపక్షం నుంచి పోటీచేసిన ఉపాధ్యాయ అభ్యర్థి తరుపున ప్రైవేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు ఓటుకు రూ.5వేలు చొప్పున పంపిణీ చేశారు. అంతాగుట్టుగా సాగింది. ప్రైవేటు విద్యాసంస్థల నుంచే ఎన్నికల ప్రక్రియ దారితప్పింది. టిడిపి నుంచీ ఆ స్థాయిలో పంపకాలు లేకపోయినా ఎంతో కొంత ఇవ్వాల్సి వచ్చింది. ఏదేమైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అప్రజాస్వామ్య పద్ధతులన్నీ వచ్చేశాయి. ఇప్పటి వరకూ మండలి పునరుద్ధరణ జరిగాక ఎన్నికలు పద్ధతిగానే జరిగాయి. మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులే గెలిచారు. ఈసారి రాజకీయంగానే వీటిని చూశారు. అందుకే రెండు పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. సాధారణ అసెంబ్లీ ఎన్నికలు మాదిరిగానే ప్రచారం చేపట్టారు. ఏఏ వర్గాలకు ఏం చేస్తామనే ఎజండా ఈ రెండు పార్టీల అభ్యర్థుల్లో లేదు. పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరెడ్డి ఇద్దరూ ఉపాధ్యాయ ఉద్యమంలో కీలకంగా రాష్ట్ర బాధ్యతల్లో పనిచేశారు. అన్ని రకాల సమస్యలపై అవగాహన ఉన్న నేతలుగా ఉన్నారు. అనేక పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, కాంటాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు. స్కీంవర్కర్లు, నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ఇలా అన్నివర్గాల ప్రజానీకం కోసం డిమాండ్లను ఎజండాలో పెట్టారు. వాటిసాధన కోసం ప్రజా పోరాటాలే ఎజండాగా ప్రచారం చేశారు. అన్నివర్గాల ఓటర్లను సాధాసీదాగా కలిశారు. ప్రజా సంఘాలు, కార్మికసంఘాలు వీరికి అండగా ప్రచారం నిర్వహించాయి. మూడు నెలలుగా పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారం

▶ 2లో

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని బైకు ర్యాలీ

- ప్రజా సేవకులకు పట్టం కట్టాలి
- పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి విజ్ఞప్తి

బైకు ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తునరన మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరుతూ సిఐటియు, విద్యార్థి, యువజన సంఘాలు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు బస్టాండ్‌లోని డిఆర్‌ఆర్‌ఎం హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కలెక్టరేట్, అద్దంకి బస్టాండ్, ఆర్‌టిసి డిపో, ఫ్లైఓవర్ బ్రిడ్జీ మీదుగా మంగమూరు రోడ్డు జంక్షన్ వరకూ కొనసాగింది. ఈసందర్భంగా పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులు 2005 నుంచి ప్రజా సేవకు అంకితమై పనిచేస్తున్నారని తెలిపారు. నీతివంతమైన రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్ వేదికగా పనిచేస్తున్నారని చెప్పారు. చట్టసభల్లో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ, వెలుపల ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలబడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలతో రాయబారాలు నడుపుతున్నారని, ఉద్యోగ, కార్మికులతో కలిసి పోరాటాలలో పాల్గొంటున్నారని వివరించారు. అలాంటి వారిని గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజా సేవలకులమైన తమకు ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చిన వాగ్ధానానికి వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయకుండా మొండి పట్టు పడుతోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రయివేటీకరణ, ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అమలు చేస్తుందన్నారు. ఇలాంటి తరుణంలో పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ గెలిపించి మండలికి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు సిహెచ్.చిరంజీవి, బి.వెంకట్రావు, సిఐటియు నగర నాయకులు సిహెచ్.రాంబాబు, టి.మహేష్, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, హుస్సేన్, శ్రీరామ శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, పిజసుబ్బారావు, జబాలకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్, డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి దానియేలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్‌కె.అమీర్, కృష్ణచైతన్య, జాన్‌బాషా పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాల యంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి కె. ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 34 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 8,359 మంది జూనియర్, 10,474 సీనియర్ ఇంటర్ విద్యార్థులు కలిపి మొత్తం 19,233 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 వరకూ పరీక్షలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమ తించరని పేర్కొన్నారు. 34 పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్ ప్రధాన కార్యాలయానికి అను సంధానం చేసినట్లు ఆయన తెలిపారు. జవాబు పత్రాలు భద్రపరిచేందుకు15 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరేందుకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. జె పంగులూరు, నూతనపాడు, వలపర్ల, నాగులపాలెం, బల్లికురవ, వేటపాలెం పరీక్ష కేంద్రాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 104 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. కళాశాలలకు ట్యూషన్ ఫీజు చెల్లించలేదని, హాజరు తక్కువగా ఉందని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా నిరాకరిస్తే ఆయా కళాశాలల అనుమతులు రద్దు చేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఏదైనా సమస్య ఎదురైతే 9948661929 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ. శ్రీనివాసులు, ఎస్‌పి వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం.. పంపిణీలు..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అన్ని మండలాల్లో తిరిగారు. పాఠశాలలు, కెజిబిలు, ప్రైవేటు విద్యాసంస్థలు, అన్ని రకాల కార్యాలయాలలో ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాలకు సమగ్రమైన డిమాండ్లను ముందుంచారు. గెలిచాక వాటికోసం పోరాడుతామని చెప్పారు. ప్రచారంలో మంచి ఆదరణ లభించింది. పిడిఎఫ్‌కు ఎప్పటిలాగే ఓటర్లు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రచారంలోనే ఈ ఆదరణ కనిపించింది. వైసిపి నుంచి పార్టీ నేతలను పోటీలో పెట్టారు. ఉద్యోగుల సమస్యలపై కనీస అవగాహన కూడా లేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు వీరిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మంత్రులు కూడా ప్రచారం చేపట్టారు. కేవలం రాజకీయకోణంలోనే చూశారు. ఇపుడు ఎమ్మెల్సీలను గెలిపిస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని, ఇవే గీటురాయిగా ప్రచారం చేశారు. ముఖ్యనేతలు కూడా ఇదే చెప్పారు. అంటే మళ్లీ అధికారం కోసం ఎమ్మెల్సీలను గెలవాలని స్పష్టంగా చెప్పారు. ఇపుడు పోటీచేస్తున్న అభ్యర్థులు ఆయా వర్గాలకు ఏం చేస్తారనే ఎజండా అంటూ ఏమీలేదు. టిడిపి నుంచి కంచర్ల శ్రీకాంత్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీచేశారు. ఆయన్ని 6 నెలల ముందే ప్రకటించారు. ఆఖరు నిమిషంలో వైసిపిని ఓడించాలంటే పరస్పర అవగాహన అవసరమని భావించారు. రెండో ఓటు పిడిఎఫ్‌కు వేయాలని టిడిపి నిర్ణయించింది. పార్టీ శ్రేణులకు ఇదే పిలుపునిచ్చింది. ఇక అధికార యంత్రాంగం పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల తరపున ఏజంట్లు కూడా అన్ని అనుమతులు తీసుకుని సిద్ధమయ్యారు.

పటిష్ట పోలీస్ భద్రత: ఎస్‌పి

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్స్, ఐ పాడ్, టాబ్స్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లడానికి అనుమతిలేదన్నారు. ఎలక్షన్ నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీ దూరం వరకు ఎవరు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చ గొట్టేవిధంగా వాక్యాలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం వంటివి చేయరాదన్నారు. అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి పనులు చేయరాదన్నారు. ఎవరైనా పోలింగ్ బూత్ లోపల ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల నియమాలకు విరుద్ధంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మూసివేయాలని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా ఎన్నికల కమిషన్, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

ఓటు కోసం గుర్తింపు కార్డు చూపాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: శాసనమండలి ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకునే వారంతా భారత ఎన్నికల సంఘం జారీచేసిన ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్)ను వెంట తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల బూత్‌లోని సిబ్బందికి ఎపిక్ కార్డు చూపించలేకపోతే ఎన్నికల కమిషన్ అనుమతించిన ఇతర గుర్తింపు కార్డులు/సర్టిఫికెట్లు అయినా ప్రత్యామ్నాయంగా చూపించవచ్చన్నారు. ఎపిక్ కార్డు లేని వారు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఇండియన్ పాస్ పోర్టు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేటు పారిశ్రామిక సంస్థలలో ఉద్యోగులుగా ఉంటే ఆ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డులు చూపాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయితే వారికి జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, విద్యా సంస్థలలో ఉద్యోగులుగా ఉంటే అవి జారీచేసిన సర్వీసు గుర్తింపు కార్డు, యూనివర్సిటీలు జారీ చేసిన ఒరిజినల్ డిగ్రీ/డిప్లమో సర్టిఫికెట్, అధీకృత సంస్థ జారీ చేసిన వికలాంగ ధ్రువీకరణ ఒరిజినల్ సర్టిఫికెట్, కేంద్ర ప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికారత మంత్రత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక వికలాంగ గుర్తింపు కార్డు చూపించవచ్చని వివరించారు. వీటిలో ఏదైనా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

'జగనన్న బడుగు వికాసం' కింద ఒకరికి కారు

ప్రజాశక్తి-పర్చూరు

కారును ప్రారంభిస్తున్న ఎంపి నందిగం సురేష్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎస్‌సి, ఎస్టీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని 45 శాతం సబ్సిడీతో బ్యాంక్ నుంచి రుణాలు పొందటానికి వీలుగా 'జగనన్న వైఎస్‌ఆర్ బడుగు వికాసం' అనే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గం, పర్చూరు మండలం, బోడవాడ గ్రామానికి చెందిన కూరాకుల ఇస్సాకుబాబు రుణం కోసం ఎంపి నందిగం సురేష్‌ను సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వ పథకాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే కెనరా బ్యాంక్ వారితో మాట్లాడి హోండా అమేజ్ కారును ఇస్సాకుబాబుకు మంజూరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఇస్సాకుబాబు ఎంపి సురేష్‌కు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

విగ్రహ నిర్మాణంపై ఎమ్మెల్యేకు కమిటీ సభ్యుల వివరణ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావును అభయాంజనేయ స్వామి కమిటీ సభ్యులు కలసి విగ్రహ పురోగతి గురించి తెలియజేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయం రాకతో పర్చూరు నియోజకవర్గం ఆధ్యాత్మికంగా బాగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అభయాంజనేయ విగ్రహ దేవాలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. కమిటీ తరపున కోట హరిబాబు ఏలూరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కఠారి సురేంద్ర, రంగిసెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, గాజుల రమేష్, కోడూరి బ్రహ్మం, తులసి అప్పారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హెపటైటిస్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఒంగోలుసబర్బన్

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వి కిశోర్

దేవరకొండ సుబ్బయ్య ఎడ్యుకేషనల్ మెమోరియల్ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 60 అడుగుల రోడ్డులోని విజయశ్రీ హాస్పిటల్ శనివారం ఉచిత హెపటైటిస్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి కిశోర్ మాట్లాడుతూ ప్రతినెలా రెండో శనివారం ఉచిత హెపటైటిస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 20 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో ఒకరికి హెపటైటిస్ బి ఉన్నట్లుగా నిర్ధారణ అయిందన్నారు. హెపటైటిస్ లేని 19 మందికి రాయితీపై వ్యాధి నిరోధక టీకా వేసినట్లు తెలిపారు. హెపటైటిస్ బి, సి వ్యాధుల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ హాస్పిటల్ పిఆర్ఒ వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి.

నా క్లయింటు రేపల్లె పట్టణం 7వార్డు డోర్ నంబర్‌నకు 12-18-89/29 చెందిన కాపు రస్తుదు దాసరి వెంకటప్పయ్య గారి కుమారుదు దాసరి గోపాలం గారికి చెందిన 376/1978 నంబర్ గల ఒరిజినల్ దస్తావేజులు, తాలూకా ఎదురుగా జిరాక్స్ షాపులో జిరాక్స్ తీయించుకుని ఇంటికి వెళ్ళటానికి ఆటోలో ప్రయాణం చేస్తుండగా ఒరిజినల్ దస్తావేజులు జారి పడిపోయింది, ఎంత వెతికినా దొరకలేదు. ఈ ఒరిజినల్ దస్తావేజులు దొరికిన వారు దయచేసి ఈ క్రింది ఫోన్ నెంబర్ 7036053992 కు తెలియ జేయగలరు.

టీ.కే.వీ గుప్త
అడ్వకేట్, రేపల్లె
ఫోన్: 9441129088

వైష్ణవికి ప్రశంసాపత్రం అందిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు

ప్రతిభా పరీక్షల్లో విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-బాపట్ల

ఎపిఫని సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా పరీక్షలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని వైష్ణవికి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించిందని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు తెలిపారు. శనివారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్ విద్యార్థి వైష్ణవికి ప్రత్యేక ప్రశంసాపత్రం, సంస్థ సమకూర్చిన రూ.8 వేల నగదు పురస్కారాన్ని అందజేశారన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యా సంచాలకులు వివిఎస్ సుబ్బారావు, బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, గైడు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉప విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, ఎడ్యుకేషన్ ఎపిఫని సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీ బిడ్డకు మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి-చీరాల

మందులు పంపిణీ చేస్తున్న రోటరీ అధ్యక్షులు డాక్టర్ బాబురావు

గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీ బిడ్డకు మంచి ఆరోగ్యంతో పాటు సుఖవంతమైన కాన్పులు అందుకుంటారని రోటరీక్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని మరియమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్లో క్లబ్ అధ్వర్యంలో గర్భిణులకు ఐరన్ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తల్లి శక్తివంతమైన ఆహార అలవాట్లు పాటించినట్లయితే శిశువు ఎటువంటి లోపం లేకుండా జన్మిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ శిరీష, హాస్పిటల్ సిబ్బంది, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ జడ్జి ,
మరియు 8 అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
M.C NO 37/2022

Between
షేక్ రిజ్వానా వగైరా ....పిటిషనర్లు
మరియు
షేక్ అహ్మద్ బాషా .... రెస్పాండెంట్
To
షేక్ అహ్మద్ బాషా, తండ్రి గౌస్ బాషా,
హౌస్ నెంబర్ 20-7-5C,లంబాడి డొంక,
నిస్సార్ మసీదు, కాపు కళ్యాణ మండపం దగ్గర,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

పై నెంబరు లో పిటిషనర్లు భరణము కోరుచు పై M.C కేసును దాఖలు చేసినారు ఈ కేసులో మీరు కోర్టు ద్వారా పంపిన నోటీసు తీసుకొననందున కోర్టు వారు మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయమని కోరి ఉన్నారు కనుక పై నెంబరు లో మీ నోటీస్ నిమిత్తం వాయిదాను తేదీ 21-03-2023 నకు వేసి ఉన్నారు. ఆరోజున ఉదయం 10:30కి పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవల్సింది లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును

ఒంగోలు
వాయిదాతేదీ : 21-03-2023 ఇట్లు
గుడిపూడి సురేంద్ర
ఎండి ఫయాజ్
జె.అనిల్ కుమార్
పిటిషనర్ల తరపున న్యాయవాదులు,
ఒంగోలు

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, పిడతలపూడి గ్రామ నివాసి మేకల అంజిరెడ్డి గారి కుమారుడు మేకల గోపి కృష్ణ గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ తండ్రిగారైన మేకల సుబ్బారెడ్డి కుమారుడు మేకల అంజిరెడ్డి గారికి పూర్వీకుల ద్వారా సంక్రమించబడి, అంజిరెడ్డి మరియు వారి కుమార్తె అయిన, అనగా నా క్లయింట్ తండ్రిగారైన అంజిరెడ్డి మరియు సోదరి అయిన తానిపర్తి సుబ్బారెడ్డి గారి భార్య అనూష, అనువారులు నా క్లయింట్ పేరు మీద ఒక సెటిల్మెంట్ దస్తావేదును వ్రాయించి చీమకుర్తి సబ్ రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెంబర్ 2620/2022 ద్వారా నా క్లయింట్‌కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నారని మరియు దిగువ షెడ్యూల్‌దాఖలా ఆస్తిని "కెన్‌ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్" ఒంగోలు వరి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్థి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యంతరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రకటించిన 7(ఏడు) దినములలోపు, ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవరికీ ఏవిధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్థి పై ఋణము తీసుకొనగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములును మా క్లయింట్ గాని ఋణదాతను కాని సిద్దపరచజాలవని యావన్మందికి తెలియజేయుటమైనది. షెడ్యూల్ : ప్రకాశం జిల్లా చీమకుర్తి సబ్ డిస్ట్రిక్ట్, చీమకుర్తి రెవిన్యూ మండలం, పిడతలపూడి గ్రామపంచాయతీ, 1 వార్డు, డోర్ నెం. 1-79 గృహమునకు సమీపము పిడతలపూడి గ్రామ సర్వే నెంబర్ 31/1ఎ గా గల స్థలమునకు హద్దులు. తూర్పు: దారి, పడమర:దారి, ఉత్తరం :మాగులూరి శేషమ్మ గారి స్థిలం, దక్షిణం:వాసెపల్లి రాజమ్మగారి స్థలము. ఈహద్దులలో 152 చ.గ.లేదా 1368 చ.అ. గా గల ఖాళీస్థలమునకు సంబంధించి రాకపోకలు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.

శిఖాకొల్లి రమేష్, న్యాయవాది,
షాప్ నెం. 5(ఎ), ఎ-బ్లాక్, 4వ ఫ్లోర్, గుప్తస్ స్ప్రైర్, 60 ఫీట్స్ రోడ్, ఒంగోలు, ప్రకాశం డిస్ట్రిక్ట్, ఫోన్: 9949136259

బాపూజీ కాలనీలో క్రూర మృగాళ్లు

- మహిళలపై అత్యాచారాలకు యత్నం
- వేటకొడవళ్లతో నగ్నంగా వీధుల్లో సంచారం
- ఎదిరించే వారిపై.. ఆయుధాలతో దాడికి వెనుకాడని వైనం
- భయం నీడన స్థానికులు

బాపూజీ కాలనీలో వేట కొడవళ్లతో స్వైర విహారం చేస్తున్న మృగాళ్లు →

ప్రజాశక్తి-మార్కాపురం

చట్టాలు ఎన్ని ఉన్నా.. క్రూర మృగాళ్ల ఆటవిక చర్యలను కట్టడి చేయలేకపోతున్నాయి. ఓ ఇద్దరు వ్యక్తులు గంజాయి, మద్యం మత్తుకు బానిసలుగా మారారు. వారిద్దరూ బావ బావమమర్దులే. ఎంతటి వారినైనా ఎదిరిస్తారు.. అంతు చూస్తామని బెదిరిస్తారు.. వేటకొడవవళ్లు చేతబట్టి నగ్నంగా వీధుల్లో సంచరిస్తారు.. మహిళలు పట్టపగలు ఒంటరిగా తిరగలేని పరిస్థితి నెలకొంది. ఎందరో మహిళలను పట్టుకోవడం... బలాత్కారాలకు పాల్పడటం అనేకం జరిగాయి. ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. ఈ ఆటవిక రాజ్యమేలుతున్నది ఎక్కడో మారుమూల ప్రాంతం అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. మార్కాపురం మున్సిపాలిటీలోని బాపూజీ కాలనీ మృగాళ్లకు అడ్డాగా మారింది!

బాపూజీ కాలనీలో ఎస్టీ జనాభా అధికం. అక్కడ నివాసితులంతా చిక్కెంట్రుకల వ్యాపారంతో జీవనం సాగిస్తారు. నిత్యం రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు. ఆ కాలనీలో నివాసం ఉంటున్న ఓ ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలతో ఆదాయం గడిస్తున్నారు. వారికి లేని అలవాట్లు లేవు. జేబు దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఎక్కువగా రైలు ప్రయాణికుల జేబులు కత్తిరిస్తుంటారు. వారిరువురూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వారు ఎంచుకున్న తప్పుడు మార్గాల్లో డబ్బు సంపాదించుకుని బాపూజీ కాలనీలోని ఇంటికి చేరుకుంటారు. ఆ తరువాత వారు ఎన్ని రోజులు అక్కడ ఉంటారో... అన్ని రోజులు అక్కడి ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. ఏదో ఒక మూలన గొడవలు జరుగుతూనే ఉంటాయి. దారిన వెళ్లే ప్రతి ఒక్కరినీ బూతులతో తూలనాడుతుంటారు. చాలా మంది ఎందుకులే గొడవ అంటూ నోరు మెదపకుండా వెళు తుంటారు. మహిళలతో కూడా అదే విధంగా వ్యవహరిస్తారు. ఒంటరిగా మహిళ వారి కంట పడితే బలాత్కారానికి బలి కావాల్సిందే. ఇలా ఎన్నో జరిగాయి. చెప్పుకోలేని స్థితిలో కొందరున్నారు. ఇక్కడి మృగాళ్ల అఘాయిత్యాలు భరించలేక కొందరు కాలనీ వీడేందుకు సిద్ధమవుతున్నారు. మరి కొందరు ఎదిరించేందుకు కూటమి కట్టారు. గత రెండు రోజుల క్రితం కూడా ఓ మహిళపై దాడికి పాల్పడ్డారు. ప్రశ్నించిన వారిపై వేటకొడవళ్లతో దాడికి ఉపక్రమించారు. వారి ఆగడాలను ఎదిరించే వారంతా కూటమి కట్టినా సాహసించలేకున్నారు. మాకు ఎదురు తిరిగే వారెవ్వరూ భూమిపై ప్రాణంతో ఉండరని మృగాళ్ల హెచ్చరికలతో అక్కడి వారంతా హడలిపోతున్నారు. స్థానికులు చేసేదేమీ లేక శుక్రవారం మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మృగాళ్ల ఆగడాలను వీడియోలతో సహా అందించారు. ఇంత జరిగినా పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృగాళ్ల ఆగడాలతో అక్కడ నివాసం ఉండలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. పోలీసులు అక్కడి ప్రజలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు. పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి..

క్షుద్ర పూజలు చేసిన ప్రదేశం

క్షుద్రపూజల కలకలం

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా అద్దంకి పట్టణ సమీపంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అద్దంకి నుంచి కలవకూరు వెళ్లే రోడ్డులో ఇటుక బట్టీల సమీపంలోని సింగరకొండ పాలెం వెళ్లే రోడ్డులో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు దర్శనమిచ్చాయి. రోడ్డుపై ముగ్గు వేయడంతో పాటు కుంకుమ, పసుపు, నిమ్మకాయలు ఉండటంతో అటుగా ప్రయాణించేవారు ఆందోళన చెందుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు ఆ మార్గంలో తిరుగుతూ ఉంటాయి. అలాంటి రోడ్డుపై ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో అటుగా ప్రయాణించా లంటేనే వాహనదారులు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. గతంలో కూడా అదే ప్రదేశంలో ఇలాంటి సంఘటన జరిగాయని స్థానికులు చర్చించుకుంటున్నారు, ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాటుసారా నిర్మూలనకు గట్టి చర్యలు

ప్రజాశక్తి-రేపల్లె: తీరంలో నాటుసారా గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ లీనా తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ తీరంలో నాటుసారా తయారీదారులపై పీడీయాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించడమే కాకుండా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, నాటుసారా నిర్మూలనలో భాగంగా అక్రమ తయారీ, నిల్వ, రవాణా, విక్రేతలపై పీడీ యాక్టు అమలు చేస్తున్నామన్నారు. నాటుసారా తయారీ, గంజాయి విక్రయించే వారిపై బైండవర్ కేసులు నమోదు చేసి, పీడీయాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీదారులు ఎవరైతే ఉన్నారో వారిపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, రహస్యంగా నాటుసారా తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించి వాటిని ధ్వంసం చేయడమే కాక అలాంటి ప్రాంతాలు ఎన్ని ఉన్నాయో వాటన్నిటిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఏ కేటగిరీ ప్రాంతాలలో గస్తీలు పెంచి వాటికి అనుసంధానమై అన్ని మార్గాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, దట్టమైన పొదల్లో, మడ అడవుల్లో, వెళ్లడానికి సరైన మార్గాలు లేని ప్రదేశాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షించి నాటుసారా నిర్మూలనకు పూర్తి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు.

బోడవాడ-రమణాయపాలెం రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలంలోని బోడవాడ-రమణాయపాలెం రోడ్డు ప్రధానమంత్రి గ్రామీణ సఢక్ యోజక కింద రూ.3.20 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరం తగ్గటంతో పాటు రవాణా సౌకర్యం కూడా మెరుగు పడుతుంది. గతంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2 సంవత్సరాల క్రితం పిఎంజిఎస్‌వై పథకం కింద రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. కేంద్రం ఆమోదంతో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. బోడవాడ నుంచి రమణాయపాలెం వరకు 5.7 కిలోమీటర్ల దూరం ఉంది. రోడ్ల అంచులు రైతులు ఆక్రమించి పంట సాగు చేసుకుంటున్నారు. సదరు రోడ్డు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశారు. అంచుల్లో మట్టి తీసి రోడ్డు మెరక వేశారు. దీనిపై క్వారీ దువ్వ 8 అంగుళాలు మందం వేసి చదును చేశారు. ఆ తదుపరి 6 అంగుళాల మందంతో వైట్ మిక్స్ వేశారు. దీనిపై 20 ఎంఎం మందంతో తారు వేసి దానిపై ఓజిఏఇఎస్ కోటింగ్ వేశారు. పర్చూరు నుంచి జిల్లా కేంద్రమైన బాపట్ల వెళ్లాలంటే వీరన్నపాలెం పోతుకట్ల, తన్నీరువారిపాలెం, రమణాయ పాలెం గ్రామాల మీదుగా చెరుకూరు వెళ్ళి అక్కడ నుంచి వెళ్లాల్సి వస్తుంది. పాతమద్రాసు రోడ్డు నుంచి రమణాయపాలెం రోడ్డు వేయటంతో నేరుగా చెరుకూరు నుంచి బాపట్ల వెళ్లే సౌకర్యం ప్రయాణికులకు ఏర్పడింది. దీంతో 8 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. వీరన్నపాలెం మీదుగా వెళ్లటానికి రోడ్లు మలుపులు ఎక్కువగా ఉండటం, రహదారి పలు చోట్ల దెబ్బతినటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పర్చూరు నుంచి జిల్లా కేంద్రమైన బాపట్ల వెళ్లాలనుకునే ప్రయాణికులు బోడవాడ మీదుగా రమణాయపాలెం చేరుకుంటే అక్కడి నుంచి సులువుగా వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తవటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం పూర్తయిన బోడవాడ-రమణాయపాలెం రోడ్డు

ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి..

జిల్లా విద్యార్థి అనుమానాస్పద మృతి

జొన్నతాళిలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయికి ఎదుగుతాడనుకున్న కొడుకు తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడన్న విషయం తెలిసి ఆ తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. విదేశాలకు వెళ్లిన 7 నెలలకే అనుమానాస్పద స్థితిలో అర్థాంతంగా తనువు చాలించిన ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నతాళి గ్రామానికి చెందిన గోవాడ రమేష్ దంపతులు గత ఐదు సంవత్సరాల క్రితం గుంటూరు పట్టణానికి వెళ్లి అక్కడ బార్బర్ షాప్ నిర్వహించుకుంటున్నారు. వీరి కుమారుడైన నాగసాయి గోపి అరుణ్ కుమార్(22) ఇంజనీరింగ్ పూర్తిచేసి 2022 ఆగస్టు నెలలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ లామ్ నార్ యూనివర్సిటీలో ఎంఎస్ కోర్స్‌లో అడ్మిషన్ తీసుకొని టెక్స్ ఫోర్టాన్ ఏరియాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు మరో మహిళా విద్యార్థితో కలిసి ఒకే అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ నుంచి గోవాడ నాగసాయి గోపి స్నేహితులకు కనిపించకపోవడంతో వీరితో పాటు నివాసం ఉంటున్న స్నేహితురాలు అమెరికా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అమెరికా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వీరు నివాసం ఉంటున్న అపార్టుమెంట్ సమీపంలోని నీటి సరస్సులో నాగసాయిగోపి మృత దేహాన్ని మార్చి 3వ తేదీన అమెరికా పోలీసులు గుర్తించి అమెరికా లోని స్నేహితులకు, ఇండియాలోని వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. గోపి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైన స్నేహితులు అమెరికా నిబంధనలు పూర్తి చేయించి మృతదేహాన్ని తమ సొంత ఖర్చులతో విమానంలో ఇండియా పంపించారు. శనివారం నాగసాయి గోపి మృతదేహం స్వగ్రామం జొన్నతాళి గ్రామానికి చేరుకుంది. అమెరికా నుంచి పోస్టుమార్టం నివేదిక అందితే గాని నాగసాయి గోపి మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుందని బంధువులు తెలిపారు. ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని ఆదుకుంటాడని అమెరికా పంపిస్తే ఏడు నెలలకే శవమై తిరిగి వస్తాడని ఊహించలేదంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. ఈ ఉదంతంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు (ఇన్‌సెట్‌లో) నాగసాయి గోపి (ఫైల్)

బాధితులకు బ్యాగు అందిస్తున్న కంట్రోలర్ బాబు

ప్రయాణికులకు బ్యాగు అప్పగింత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: చీరాలకు చెందిన పి చంద్రశేఖర్ కుటుంబం చీరాల నుంచి అద్దంకి మండలం సింగరకొండ పెళ్లికి వెళుతున్నారు. బ్యాగులో పెళ్లి కూతురుకు సంబంధించిన పట్టు చీరలు ఉన్న బ్యాగు ఉంది. చీరాల నుంచి ఇంకొల్లు వచ్చి అద్దంకి బస్సు ఎక్కారు. వాళ్లు వచ్చిన చీరాల బస్సు తిరిగి వెళ్లిపోయింది. గమనించుకున్న బాధితులు వెనక్కు వచ్చి బ్యాగు బస్సులో మర్చిపోయామని, ఇంకొల్లు కంట్రోలర్ షేక్ బాబుకు వివరించారు. స్పందించిన బాబు సదరు బస్సు కండక్టర్‌తో మాట్లాడి ఎదురువచ్చే బస్సులో బ్యాగు తెప్పించి బాధితులకు అందజేశారు. దీంతో బాధితులు కంట్రోలర్ చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన బాపట్ల జిల్లాలోని 13 మండలాలలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఇతర ప్రాంతాల నుంచి ఎవరూ రావద్దని కోరారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వి కృష్ణయ్య

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్: పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపరిచిన ఉమ్మడి ప్రకాశం నెల్లూరు చిత్తూరు జిల్లాల పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ అభ్యర్థి పి బాబురెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం వారు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వారు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, శాసనమండలిలో నిరుద్యోగం, సిపిఎస్ రద్దు, విద్యా విధానం కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలపై పోరాడే సత్తా ఉన్న అభ్యర్థులు అని వారు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-చీరాల: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకుంటారని వూర మస్తాన్‌రావు అండ్ శివరాజకుమారి ట్రస్ట్ ప్రతినిధులు మస్తాన్‌రావు పేర్కొన్నారు. గత వారం నుంచి చీరాల మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 1100 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల పాఠశాలలకు నోటీస్ బోర్డులు కూడా అందించినట్లు చెప్పారు. అన్నదానాలు కూడా చేసినట్లు వివరించారు. సహకరించిన ట్రస్ట్ సభ్యులు చారుగుళ్ల గురుప్రసాద్, పాగోలు గాంధీ, డివిడి ప్రసాద్, పాబోలు భాస్కరరావు మరియు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి 13 పోలింగ్ రోజున బోనఫైడ్ ఓటర్లుగా ఉన్న ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఇచ్చిన మెమో ప్రకారం పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు ఉత్తర్వులు అనుసరించి జిల్లాలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉద్యోగులకు వీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల అడ్రస్ ఎంట్రీ అధికారులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుందని పేర్కొన్నారు. ఆమేరకు ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు.

పెద్దల సభకు మేధావులనే పంపించుకుందాం

- దొంగ ఓట్లు చేర్చి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వైసిపి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు
- పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని బైకు ర్యాలీ

బైకు ర్యాలీలో నిర్వహిస్తున్న సిఐటియు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చీరాల

మేధావుల సభకు మేధావులనే పంపించుకుందాం అని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ వాటి సమస్యల పరిష్కారం కోసం పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెంకటేశ్వరరెడ్డి బాబిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించుకోవాలని తద్వారా మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక శ్రామిక వర్గాల సమస్యల పరిష్కారం జరుగుతాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె ఉమా మోహన్ కె ధనలక్ష్మిలు అన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక

బైక్ ర్యాలీలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, ధనలక్ష్మి

మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై దర్బార్ రోడ్డు, పేరాల, ఐటిసి, మసీద్ సెంటర్ కూరగాయల మార్కెట్ రోడ్డు తహశీల్దారు కార్యాలయం, గడియార స్తంభం సెంటర్ మీదగా సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వైసిపి దిగజారుడు రాజకీయం చేసి ఎమ్మెల్సీ ఎన్నికలలో దొంగ ఓట్ల చేర్పులకు పాల్పడిందని అన్నారు. నేడు ఉద్యోగులను, ఉపాధ్యాయులను వైసిపి ప్రభుత్వం వేధిస్తూ వారికి సకాలంలో జీతాలు కూడా చెల్లించకుండా అనేక ఒత్తిళ్లకు గురి చేస్తూ వారిని రోడ్డుపైకి తెచ్చిందని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. గత మూడున్నర ఏళ్ల కాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై వేధింపులు పాల్పడుతుందని ఆరోపించారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు అందించడం చేతకాని ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమేనని అన్నారు. ప్రభుత్వ తీరుపై ఎవరైనా నోరు మెదిపితే వారిపై అక్రమ అరెస్టులు, నిర్బంధ కాండలు చేయడం వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. గతంలో ఎప్పుడు ఉద్యోగులు ఉపాధ్యాయులు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేసిన సంఘటనలు లేవని అన్నారు. రిప్రజెంటేషన్ చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకున్నారని అన్నారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేలు మాట్లాడాలని అన్నారు. ఉద్యోగులను వేధిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయని స్పష్టం చేశారు. జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, శ్రామిక వర్గాల ప్రజా సమస్యలపై శాసనమండలిలో మాట్లాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు జిల్లాఅధ్యక్షులు సిహెచ్ మణిలాల్, నాయకులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్, సహాధ్యక్షులు బిక్షాలు బాబు, కోశాధికారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జానీ బాషా, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రామారావు, ఎయిడెడ్ కన్వీనర్ కుర్ర శ్రీనివాసరావు, వెలుగొండరెడ్డి, రాజేష్, సయ్యద్ జానీ భాష, సిఐటియు నాయకులు సత్యమూర్తి, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, కిరణ్, ఆర్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వి శివనాగరాని తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతివ్వండి

జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్‌ను కోరిన ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలకు మద్దతు తెలియజేయాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన మార్కాపురం వచ్చి జనసేన పార్టీ కార్యాలయంలో ఇమ్మడి కాశీనాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈపాటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మద్దతు ప్రకటించారని, మార్కాపురం నియోజకవర్గంలో కూడా జనసేన పార్టీ తరపున కార్యకర్తలతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో తిరుగుతానని పేర్కొన్నారు. పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం జనసేన పార్టీ సభ్యులు, పవన్ కల్యాణ్ అభిమానులు పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కాశీనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డీకేఎం రఫీ, దగ్గుపాటి సోమయ్య, జి బాలనాగయ్య, కెవిపిఎస్ నాయకులు జవాజి రాజు, డివైఎఫ్ఐ నాయకులు జక్కి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, చరణ్, బాబ్జి, జనసేన పార్టీ తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, మార్కాపురం జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుకు ఓటు వేయాలని కోరుతున్న కాశీనాథ్‌తో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

గ్రామ పంచాయతీ డబ్బుతో విద్యుత్ బిల్లులు కట్టాలని..

సర్పంచులపై ఒత్తిడి తేవడం దుర్మార్గం

సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీలోని జనరల్ ఫండ్‌లో ఉన్న డబ్బులతో విద్యుత్ బిల్లులకు కట్టాలని గ్రామ కార్యదర్శులు సర్పంచుల మీద ఒత్తిడి తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్ పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిల చెల్లిస్తూ వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇలా జనరల్ ఫండ్ నిధులను బిల్లుల చెల్లింపునకు వినియోగించాలనుకోవడం సరికాదన్నారు. గత రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది కలిసి ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేసి ఖాతాల్లో జమ చేశారు. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా జనరల్ ఫండ్‌ను విద్యుత్ బిల్లులు పేరుతో తీసుకుంటామని అనటం దుర్మార్గమైన చర్య అని, ఈ

నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు అందరు కలిసి పార్టీలకతీతంగా పెద్దఎత్తున పోరాటం చేస్తామని కృష్ణమోహన్ తెలిపారు. ఎవరు కూడా విద్యుత్ బకాయిలు చెల్లించవద్దని సర్పంచ్‌లకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పంచాయతీ అధికారులు.. కమిషనర్, పంచాయతీరాజ్ శాఖ వారి ఆదేశాల ప్రకారం శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, విస్తరణాధికారుల ద్వారా పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామ పంచాయతీ సర్పంచుల్ని విద్యుత్ బకాయిల నిమిత్తం ఒత్తిడి చేస్తున్నారు. ఎవరూ కూడా నిధుల విడుదల కోసం తంబ్ వేయవద్దని అన్నారు. విద్యుత్ బకాయిలు చెల్లించే దానికి సర్పంచ్‌లు వ్యతిరేకం కాదు కానీ గ్రామంలో ప్రధానమైన పారిశుధ్య కార్యక్రమాలు, జీతాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కూడా ముఖ్యం. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు విడతల నిధులు ఈ నెలాఖరుకు కేంద్రం నుంచి వచ్చే అవకాశాలు ఉంది. ఆ నిధులు వచ్చిన తర్వాత దాని నుంచి ఏంత శాతం మేర ఇవ్వవచ్చో చూసి గ్రామానికి వచ్చిన నిధులు పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ శాఖ వారికి చెక్కులు ఇవ్వొచ్చు. అందువలన సర్పంచులు ప్రస్తుతం విద్యుత్ బిల్లుల కోసం ఎవరూ కూడా ఎటువంటి చెల్లింపులు చేయవద్దని కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచన చేసి కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే వచ్చే విధంగా కృషి చేయాలని, జనరల్ ఫండ్ నిధులను వాడుకోవద్దని, అలాగే ఈ మార్చి నెలలో సర్పంచులు పెట్టుకున్న బిల్లులు వెంటనే మంజూరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలు చేయకపోతే, సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

- పొదిలిలో బైకు ర్యాలీ
- పలు చోట్ల సమావేశాలు, కరపత్రాల ఆవిష్కరణ

పొదిలిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విద్యాశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ టి. గోపాల్ రెడ్డి కోరారు. శింగరాయకొండ మండలం మూలగుంట పాడులోని అభ్యుదయ విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా వారు శాసన మండలిలో ప్రజల పక్షాన పోరాటం చేస్తారన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పి. బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, విశ్రాంత జడ్‌పి సిఇఒ జి.శేషయ్య , జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.జయప్రకాష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు , ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు, యుటిఎఫ్ జిల్లా నాయకులు జె. కేశవరాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కోటపాటి నారాయణ, విశ్రాంత ఉద్యోగులు సరిపాల ఈశ్వరయ్య , టి.రామ్మూర్తి , బండి కోటేశ్వరరావు,ముల్లంగి సిఐటియు నాయకులు టంగుటూరి రాము, అత్తోట సువర్ణ రాజు ,పడిదపు రవి కుమార్ ,ప్రతాప్ రెడ్డి , కెవిపిఎస్ నాయకులు పేమల బాబూరావు పాల్గొన్నారు. **కొండపి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విద్యాశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గోపాల్‌రెడ్డి మాట్లాడారు. పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాని కోరారు. విశ్రాంత ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి జి. శేషయ్య మాట్లాడుతూ విద్యారంగం దేశంలో 30వ స్థానంలో ఉందని తెలిపారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ జిల్లా అభివద్ధి జరగాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ముప్పరాజు భద్రయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జయప్రకాష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్, సిఐటియు నాయకుడు జి.వందనం, కెజి. మస్తాన్ పాల్గొన్నారు. **పొదిలి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజాసమస్యలను ప్రస్తావించేందుకు తూర్పు రాయలసీమ శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న ఉపాధ్యాయ నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేస్తున్న నిరంకుశ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. తొలుత స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన బైకు ర్యాలీ పోలీస్ స్టేషన్, పెద్ద బస్టాండ్, శివాలయం సెంటర్, చిన్న బస్టాండ్ మీదుగా తిరిగి ఎంపిడిఒ కార్యాలయం వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పిల్లి రమణారెడ్డి, ఎస్‌కె. అబ్దుల్ హై, పి.బాల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు ఎ. శ్రీనివాసరావు, బి .నాయక్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు కె. చిన్నప రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు ఎ. బాదుల్లా, మదార్ వలి, సిహెచ్.సుబ్బారావు, జెవివి, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **చీమకుర్తి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్, సిఐటియు,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను కలిసి పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడవెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పట్టణంలోని పలు ప్రైవేటు,ప్రభుత్వ పాఠశాలల్లో,పలు ప్రాంతాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు,ౌ కవిపిఎస్ నాయకులు టి.రామారావు, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసరావు,రమేష్ పాల్గొన్నారు. **ఒంగోలు క్రైం :** ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే పిడిఎఫ్

త్రిపురాంతకంలో మాట్లాడుతున్న బి. రఘురాం

అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో కార్మికసంఘాల నాయకులు శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ పెద్దల సభకు వెళ్లే మేధావులను ఓడించేందుకు అధికార పార్టీ అనేక ప్రలోభాలకు పాల్పడుతుందని విమర్శించారు. అధికారులు, పోలీసులను ఉపయోగించి అనేక చోట్ల ఉపాధ్యాయ ఓటర్లకు నగదు పంపిణీ చేసినట్లు ఆయన విమర్శించారు. పిడిఎఫ్ పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యా నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలువలేని తెలియడంతో అధికార పార్టీ పెద్ద ఎత్తున దొంగ ఓట్లను చేర్పించినట్లు విమర్శించారు. ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు సర్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు మాదాల వెంకట్రావు,సిహెచ్. రామారావు తదితరులు పాల్గొన్నారు. **త్రిపురాంతకం :** ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,విద్యార్థి, మహిళ, రైతు కూలీల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు, ఎఐటియు నాయకులు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిఐటియు నాయకుడు రఘురాం, ఎఐటియుసి నాయకులు దేవెళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై శాసన మండలిలో గళం విప్పాలంటే పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబు రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం దుకాణదారులు, పట్టభద్రులను కలిసి కరపత్రాలు పంచి పిడిఎఫ్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రచారం నిర్వహించారు.ఈ సమావేశంలో జి.రాజారామయ్య పాల్గొన్నారు.. **ఒంగోలు కలెక్టరేట్ :** ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. పిడిఎఫ్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో శాసన మండలి 2007 లో తిరిగి ప్రారంభమైన తర్వాత పిడిఎఫ్ అభ్యర్థులే విజయం సాధించినట్లు తెలిపారు. వారు గత 15 సంవత్సరాలు ఉద్యోగ కార్మిక వర్గాలతోపాటు, గ్రామీణ పేదలు, కష్టజీవుల సమస్యలపై జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. పేదలకున్న హక్కులు, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్న సందర్భాల్లో ఆ చర్యలను అడ్డుకోవడంలోనూ, రైతు, వ్యవసాయ కార్మిక, గ్రామీణ పేదల సంఘాలు చేపట్టిన ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనటమే కాక, శాసన మండలి లో కూడా ప్రభుత్వంపై నికరంగా పోరాడారని తెలిపారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కెజి.మస్తాన్, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, శేషారావు పాల్గొన్నారు.

శింగరాయకొండలో సమావేశంలో పాల్గొన్న నాయకులు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్య.కా.సం నాయకులు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో 30,000 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వారిని రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి కోరారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రూ.12,500 జీతంతో ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పెరిగిన ధరలతో ఓ కుటుంబం రోజుకు రూ. 400 జీతం తో గడపడం సాధ్యమేనా అని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా ఎక్కడైనా ఉద్యోగులకు ప్రమోషన్ వస్తే జీతం పెరుగుతుందని, రూ.15,000 జీతం తీసుకొనే వాచ్‌మన్ కు షిఫ్ట్ ఆపరేటర్ గా ప్రమోషన్ వస్తే 13,500 ఇవ్వడం గర్హనీయమన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తాను తప్పక కషి చేస్తానని, గ్రాడ్యుయేట్లు అందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు.

పాలిషింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మస్తాన్‌రెడ్డి

కెవి ఎక్స్‌పోర్ట్సు ప్రారంభం

చీమకుర్తి : చీమకుర్తి మండలం కెవిపాలెం పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన కెవి ఎక్స్‌పోర్ట్సు గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను చీమకుర్తి గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు చిన్నపురెడ్డిమస్తాన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ రంగం అనేక యువకులకు ఉపాధి కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గొల్లపూడిచౌదరి, కెవి ఎక్స్‌పోర్ట్సు అధినేత ఎస్‌కె.కాలేషా,ఎస్‌కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు ప్రైవేట్ లెక్చరర్ల మద్దతు

ఒంగోలు కలెక్టరేట్ : పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి. బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ.వెంకటేశ్వర రెడ్డి పిఎల్‌పిడబ్ల్యుఎ (ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్ వెల్ఫేర్ అసోసియేషన్) సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు తాంద్ర రమణ, జిల్లా అధ్యక్షులు సాంబశివరావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రైవేట్ టీచర్స్ కోసం నిరంతరం కషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయులు సంక్షేమ పట్ల ప్రభుత్వానికి ఏ విధానం లేదని, కార్మిక చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు అమలు కాకపోవడంతో ప్రైవేట్ ఉపాధ్యాయులందరిని ప్రభుత్వం గుర్తించి ఐడెంటీ కార్డులు ఇవ్వాలని, వారి కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరుతున్నారన్నారు. హెల్త్ కార్డులు ఇచ్చి ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం అనుసంధానం చేయాలని, కార్మిక చట్టాలను జీవో నెంబర్ 1 అమలు చేయాలని నిరంతరం ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ టీచర్స్ సంక్షేమం కోసం పోరాడే వారికి సంపూర్ణ మద్ధతు ఇస్తున్నామన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్ : పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించే ప్రక్రియలో ర్యాండమైజేషన్ విధానాన్ని జేసీ ఎం.అభిషిక్త్‌కిషోర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ర్యాండమైజేషన్ విధానం గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.చినఓబులేసు, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.క్రాంతికుమార్, సిపిఎం నగర కమిటీ సభ్యులు శ్రీరామ శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివిఆర్.చౌదరి, బిజెపి నాయకులు గుర్రం సత్యనారాయణ పాల్గొన్నారు

సంపద తయారీ కేంద్రంలో తనిఖీ

చీమకుర్తి : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బండ్లమూడి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. క్లాప్ మిత్రులు ప్రతిరోజూ సేకరిస్తున్న చెత్తను పరిశీలించారు. వర్మి కంపోస్టు తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ వర్మీకంపోస్టు తయారీని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, మురుగు కాలువల పూడికతీత కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్‌విఎం ఐటివిఎ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి, సర్పంచి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రసాభాస

- నిధుల కేటాయింపులో వివక్షపై సభ్యుల నిలదీత
- అర్థాంతరంగా ముగిసిన సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికార పక్షంలో ఉుకలుకలకు వేదికగా మారింది. మండల పరిధిలోని ఎంపిటిసిలు అందరూ అధికార వైసిపికి చెందిన వారే. ఒక్కతాటిపై ఉండాల్సిన అధికార పక్షానికి చెందిన ఎంపిటిసిల్లో కొందరు నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నారని అసహనానికి గురయ్యారు. ఎంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డిని సమావేశంలో నిలదీశారు. సుదీర్ఘంగా సమస్యలపై చర్చ నడవాల్సిన సమావేశం ఎలాంటి చర్చ లేకుండా పట్టుమని పది నిముషాలకే

మాట్లాడుతున్న ఎంపిపి అరుణా చెంచిరెడ్డి

అర్ధాంతరంగా ముగియడం గమనార్హం. మండల పరిషత్ గ్రాంట్ తమకు తెలియకుండా డ్రా చేస్తున్నట్లు పలువురు ఎంపిటిసిలు గగ్గోలు పెట్టారు. గజ్జలకొండ-1, గజ్జలకొండ-2 ఎంపిటిసిలు జమ్ములమూడి రమేష్, మాలపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిధుల వివక్షపై ఎంపిపి అరుణా చెంచిరెడ్డిపై ధ్వజమెత్తారు. ఎంపిపి అరుణా చెంచిరెడ్డి స్వగ్రామంలో రూ. 25.40 లక్షల ఖర్చు చేశారన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలి స్వగ్రామానికి రూ. 13 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇద్దరు ఎంపిటిసిలు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్జలకొండకు మాత్రం కేవలం రూ. 8 లక్షలు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో సర్పంచులకు కమీషన్ల ఎరచూపి ఎంపిటిసిలతో సంబంధం లేకుండా బిల్లులు చేసుకుంటున్నట్లు వారు ఆరోపించారు. దీంతో ఎంపిపి పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి కూడా ఎదురుదాడికి దిగడంతో గందరగోళం నెలకొంది. అంతా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే అయినా... పరిస్థితి అదుపు తప్పేలా ఉందని గ్రహించిన ఎంపిడిఒ ఎస్.నరసింహులు సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు. ఈ సమావేశంలో చిన్నతరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ మేడా బద్రినాథ్, ఆరె కటిక కార్పొరేషన్ డైరెక్టర్ సవ్వాని వెంకమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నలబోతుల కొండయ్య, ఇఒపిఆర్‌డి రామ్మోహన్‌రెడ్డి, ఎంఇఒ బి.రాందాస్‌నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్.ప్రతాప్‌రెడ్డి, ఎపిఎం రమేష్‌బాబు, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం యర్రగొండపాలెం పట్టణంలో పట్టభద్రుల రెండు పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్‌ను తహశీల్దారు రవీంద్రారెడ్డి, ఎస్ఐ కోటయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి ప్రణాళికా బద్ధంగా పోలింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలోని ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, పోలింగ్ ఏజెంట్ల ప్రాంతం, బ్యాలెట్ పేపర్ నిర్వహణకు అనుగుణంగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆర్ఐ నాసర్‌వలి, విఆర్ఒ పోతులూరయ్యరెడ్డి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **పొదిలి:** ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ డి. భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాట్లను తహశీల్దారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, పటభద్రుల శాసనమండలి ఎన్నికలకు మొత్తం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం మొత్తం 207 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఓటర్ల కోసం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **హనుమంతునిపాడు :** ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్‌పి అశోక బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులుమత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు ఎస్ఐ కష్ట పావని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తర్లుపాడు :** ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు బి. శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్ :** ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని జాగ్రత్తగా చదివించుకోవాలన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో టీవీలను ఆపివేయాలన్నారు. ఎస్ఐ దీపిక మాట్లాడుతూ విద్యార్థులను మాదకద్రవ్యాలు డ్రగ్స్, వైన్స్ దూరంగా ఉంచాలన్నారు. వాటి వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలతో సరదాగా గడపాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురు స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివించుకోవడం అదృష్టమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కడెం ఆంజనేయులు, ఉపాధ్యాయులు రామారావు, ఆంజనేయ చౌదరి, జట్ల రవికుమార్, యుద్ధం శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మల్లేశ్వరి, మనోరమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వధూవరులకు ప్రముఖుల ఆశీర్వాదం

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక సాయి బాలాజీ కళ్యాణ మండపంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి చిన్న మామ, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి సోదరుడు, కెకెమిట్ల మాజీ ఎంపిపి ఉడుముల రాంనారాయణ రెడ్డి కుమారుడు ఉడుముల స్వరూప రెడ్డి, నిఖితారెడ్డి వివాహ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి ఆది మూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు బుర్రా మధుసూధనరావు, కె. నాగార్జున రెడ్డి, అన్నా వెంకట



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖులు

రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కెపి. కొండారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చెన్నుపల్లి చెంచు గిరిజన గూడెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్తపూతలు తీసి మందులు అందజేశారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేశారు. ఈ కార్యక్రమంలో బాషా, మాధవిలత, జ్యోతిరాణి, శ్రీనివాసులు, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు

ప్రజాశక్తి - వెలిగండ్ల

యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల దూరంగా ఉండాలని ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు తెలిపారు. మండల పరిధిలోని మొగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు-దుష్పరిణామాలు అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఆర్ అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ అత్యంత ప్రాముఖ్యమైనదని, విద్యార్థి దశలో కొంతమంది సరదాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవై, చెడు స్నేహాల కారణముగా తాత్కాలిక ఉపశమనం కోసం గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి, క్రమేపి వాటికి బానిసలవుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు ఆకర్షితులు కాకుండా స్కూల్, కాలేజీ యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాద కద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినులు దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ హనుమంతు, ఉపాధ్యాయులులు పాల్గొన్నారు

యర్రగొండపాలెం : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. మిల్లంపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాల, గిరిజన జూనియర్ కళాశాలలో శనివారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలో

మాట్లాడుతున్న ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్‌బాబు

సూచనలు చేశారు. వీడియోల ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి హాని కలిగిస్తాయని తెలిపారు. వీటి వినియోగం ప్రమాదమైన వ్యసనమని, యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాలలో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో, కళాశాలలో చేర్పిస్తున్నారన్నారని తెలిపారు. అయితే కొందరు స్నేహితుల ప్రభావం వల్ల డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒకసారి డ్రగ్స్‌కి అలవాటయితే జీవితాన్ని అధ:పాతాళానికి వెళ్తుందని తెలిపారు. గంజాయి, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్‌డి మొదలగు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ చట్టాన్ని చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను వినియోగించిన, కలిగివున్న, విక్రయించిన, రవాణా చేసిన 10 నుంచి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడుతుందని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే సత్ప్రవర్తన అలవరుచుకొని జీవితంలో ఉన్నతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ టి.రాజేంద్రబాబు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **పొదిలి :** విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. స్థానిక వీరిశెట్టి జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్నేహం ముసుగులో విద్యార్థులకు చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల మానసిక వికాసం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **కంభం రూరల్ :** యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారి జీవితాలు నాశనం అవుతాయని మార్కాపురం డిఎస్‌పి మహతి కిషోర్ కుమార్ తెలిపారు. స్థానిక సాధన కళాశాలలో శనివారం సంకల్పం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. సిఐ రాజేష్ కుమార్, కంభం ఎస్ఐ నాగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువత మంచి కంటే చెడుకు ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **దర్శి :** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాళ్ళూరు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. తాళ్ళూరులోని శ్రీఎబిసి స్కూల్‌లో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, మహిళా పోలీసు భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. దర్శిలోని గీతాంజలి కళాశాల,న గౌతమి గ్రామర్ స్కూల్‌లో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలి
- విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చిన్నగంజాం

పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు సూచించారు. ఆహార విషయంలో జాగ్రత్తలు వహించాలని కోరారు. చిన్న గంజాం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి రత్నకుమారి ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి, మరియు విద్యార్థుల ప్రవర్తన గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులు ఆరోగ్య విషయంలో 10వ తరగతి పరీక్షలు అయిపోయేంత వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులు యొక్క ప్రవర్తన, చదువుకునే తీరు మరియు ఆటపాటల్లో ఉపాధ్యాయులు కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. ప్రతి విద్యార్థి కూడా పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలన్నారు. మంచి ర్యాంకులతో స్కూలుకు పేరు తీసుకురావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో 2014వ సంవత్సరం మొట్టమొదట ఐఐఐటి సాధించిన విద్యార్థిని మల్లేశ్వరి విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పారు. తల్లిదండ్రులను గౌరవించాలని పేర్కొన్నారు.

అద్దంకి: సమగ్ర శిక్ష ఎస్‌పిడి ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా ప్రోత్సహిస్తూ వారికి మంచి పౌష్టికాహారం ఇవ్వాలని, పరీక్షలు పూర్తయ్యేవరకు రోజూ పాఠశాలకు పంపించాలని కోరారు.

భట్టిప్రోలులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

చిన్నగంజాంలో హాజరయిన విద్యార్థులు, తల్లిదండ్రులు

అద్దంకిలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం

మొబైల్ ఫోన్, టీవీకి దూరంగా ఉంచాలని కోరారు. ఉదయాన్నే నిద్ర లేపి చదివించాలని కోరారు. పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి అని తెలియజేశారు. వేరే విద్యార్థులతో పోల్చకుండా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ తరపున తోకల ఉమాదేవి వీరాంజనేయులు రవితేజ రాజేశ్వరి, ఉపాధ్యాయులు మూల్పూరు ప్రసాద్, దాసరి ప్రసాద్, ఉగ్గరాజు వెంకటేశ్వర్లు ప్రతాప్ నాగేశ్వరరావు శివయ్య ఏడుకొండలు, ద్వారక, శకుంతల, ఖాసింబీ, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా క్రమ శిక్షణతో చదవాలని టిఎం రావు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సి రామకోటేశ్వరరావు సూచించారు. శనివారం పాఠశాలలో వార్షిక పరీక్షలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు తగిన పౌష్టికాహారం అందజేసి విద్యనభ్యసించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహం చేయాలి

ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించడమే కాకుండా వారితో స్నేహపూర్వకంగా ఉంటూ వారి అలవాట్లను ఎప్పటికప్పుడు గమనించాలని, తద్వారా పిల్లలు మంచిమార్గంలో నడుస్తూ చదువులో రాణించగలుగుతారని ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్‌రాజు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆంధ్రరత్న పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు మొదటి గురువు తల్లి అన్నారు. ఉపాధ్యాయుల పైన ఎంత బాధ్యత ఉందో తల్లిదండ్రులపైన కూడా అంతే బాధ్యత ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించి పరిశుభ్రమైన వాతావరణంలో వారిని ఉంచినప్పుడే వారికి చదువు పట్ల ఆసక్తి కలుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం సాల్మన్ రాజు

మాట్లాడుతున్న గూడపాటి శ్రీనివాసరావు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయా మున్సిపల్ వార్డుల క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి వార్డులో 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. యువగళం పాదయాత్ర పేరుతో లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్ర 50 రోజులు 500 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్ వారీగా ఆయా వార్డుల ఇన్‌ఛార్జులు, అధ్యక్ష కార్యదర్శులు ఓటర్ల జాబితాను వెరిఫికేషన్ చేసి చేర్పులు మార్పులు పార్టీ కార్యాలయానికి సమగ్రంగా నివేదిక అందజేయాలని కార్యాలయ ఇన్‌ఛార్జి జీవి నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో జీపి రామారావు, కౌన్సిలర్ అన్నే రామకష్ణ, వెనిగళ్ల శివ సుబ్రహ్మణ్యం, కవిత్వం శివ, దేవగిరి రవిశంకర్, గోగినేని శ్రీనివాసరావు, దున్న జయప్రద, మోర్ల అరుణకుమారి, తాడిపత్రి మల్లికార్జునరావు, యలవర్తి శ్రీలక్ష్మి, ఆయా వార్డుల ఇన్‌ఛార్జులు, అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.


వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు

బొల్లా వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఆనందబాబు

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బొల్లా శ్రీనివాసరావు కుమారుని వివాహ వేడుకల్లో శనివారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొల్లూరు, భట్టిప్రోలు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె: మారుతున్న సమాజానికి అనుగుణంగా సుప్రీంకోర్టు, హైకోర్టు చేస్తున్న చట్టాలను మహిళలు తెలుసుకొని తమ హక్కులు కాపాడుకోవాలని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దిశ యాప్ గురించి మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు సంబంధించిన ఫోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చట్టాల గురించి మహిళలు అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎల్ జగదీష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, ఎంపిడిఓ మల్లికార్జునరావు, ఏపిఎం త్యాగరాజు, గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాదులు కాళిదాసు, యూనస్, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి-చీరాల

బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ గడగడలాడించిన మహనీయులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశం కోసం పోరాటం చేసిన మహానుభావులలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒకరు అని బ్రిటిష్ వారిని గడగడలాడించిన ధీశాలి అన్నారు. ఈ తరం ఆయన చేసిన త్యాగాన్ని గుర్తించాలి అని తెలిపారు.అనంతరం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఫలహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, అన్నంరాజు సుబ్బారావు, శీలం రవి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

కుక్కలు బాబోయ్ కుక్కలు!

- శునకాల స్వైర విహారం
- హడలిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-పర్చూరు

మండల పరిధిలోని గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. రాకపోకలు సాగించే సమయంలో కుక్కలు దాడులు చేస్తుండతో ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రోడ్లు, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అటువైపుగా వచ్చిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డమీదకు రావాలంటేనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తమపై కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని ఆవేదన చెందుతున్నారు. గత పది రోజుల్లో అనేక మంది ప్రజలు కుక్కల దాడిలో గాయపడ్డారు. ప్రధానంగా మండల పరిధిలోని దేవరపల్లి, ఉప్పుటూరు, నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు, పర్చూరు గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. మాసం దుకాణాల వద్ద కుక్కల బెడద అధికంగా ఉంటుంది. మాంసం వ్యర్థాలు తినేందుకు కుక్కలు అక్కడికి పెద్దసంఖ్యలో వస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని తరుముతూ వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. కొందరు వాహనదారులు కుక్కలకు భయపడి ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల

కుక్కల దాడిలో గాయపడిన వృద్ధులు

ముస్లిం బజారులో కుక్కలు వెంటబడటంతో తప్పించుకునే ప్రయత్నంలో ఓ వ్యక్తి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గేదెలు, దూడలపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధుల్లో తిరుగుతున్న కుక్కలను పట్టించి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు 2వ ప్రాధాన్యత ఓటు వేయాలి

టిడిపి శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ పిలుపు

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు 2వ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే టిడిపి నేతలపై అక్రమ, దుర్మార్గపు, అవినీతి, దౌర్జన్యానికి పాల్పడుతున్న ఓడించాలన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వైఎస్. వివేకానంద రెడ్డి హత్య అంశం నుంచి ప్రజల దృష్టి మరలచడానికి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సంస్థపై అవినీతి ఆరోపణలు చేస్తూ అక్రమ అరెస్టులకు తెరలేపారని విమర్శించారు. వైసిపి డైవర్షన్ రాజకీయాలకు పెట్టింది పేరని, ప్రజల దృష్టిని మరల్చడానికే టిడిపి నేతలపై, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని వైసిపి ప్రభుత్వానికి తగురీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలకు తెరలేపిందని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించారు కోరారు. ఈ సమావేశంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి కేసన శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ఒంగోలు సబర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థికి ఓట్లు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న ఒంగోలు ఎంపిడిఒ కె శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈమేరకు ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిని శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. ఒంగోలు ఎంపిడిఒ ఈనెల 10న మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించినట్లు తెలిపారు. ఆ సమయంలో ఉపాధ్యాయులందరూ అధికార పార్టీ బల పరిచిన పట్టభద్రుల అభ్యర్థి పి శ్యాం ప్రసాద్‌రెడ్డికి ఓట్లు వేయాలని ప్రచారం చేశారని పేర్కొన్నారు. తక్షణమే ఆయన డైలీ డ్యూటీ రికార్డును స్వాధీనం చేసుకొని, అధికార దుర్వినియోగంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కొండారెడ్డి డిఆర్ఓను కోరారు. డిఆర్ఓను కలిసిన వారిలో సిపిఎం ఒంగోలు నగర నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు ఉన్నారు.

విజయరాణికి సన్మానం

విజయరాణిని సన్మానిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి- దొనకొండ
దొనకొండలోని ఆర్‌సిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఏరువ విజయరాణి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి జువాలజీ మరియు ఆక్వాకల్చర్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం అభినందన సభ నిర్వహించారు. సభలో ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ ఏరువ విజయరాణి గౌరవ డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని తెలిపారు. అనంతరం విజయరాణికిని శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సాంబశివరావు, ఉపాధ్యాయులు వై.అంతోనిదాస్, పుష్పకుమారి, వి. వెంకటేశ్వర్లు, ఎలిజబెత్, నాగరాజు, ప్రమీల, కవిత, జూలియట్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

- వైఎస్ జగన్ వెంటే ఉంటా

- దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

ప్రజాశక్తి-దర్శి
తాను పార్టీ మారతానని జరుగు తున్న ప్రచారం అవాస్త వమని ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి వెంటనే నడుస్తానని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తన కుమారుడి వివాహ పనుల కారణంగా తాను రెండున్నర నెలలుగా దర్శిలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండలేక పోయినట్లు తెలిపారు. అప్పుడప్పుడూ వచ్చి పోతూ ఉండటం వల్ల పార్టీ మారుతున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చినట్లు తెలిపారు. అది వాస్తవం కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై తనకు నమ్మకం ఉందని తనపై ఆయనకు నమ్మకం ఉందని తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలో మొట్టమొదటిగా వైసిపి గెలిచే సీటు దరిశేనని ఆయన తెలిపారు. ఇప్పటి నుంచి పార్టీ ఆదేశించిన ప్రకారం నడుచుకుంటూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

బండలాగుతున్న ఎడ్ల జత

ప్రజాశక్తి-దర్శి
మండల పరిధిలోని చలివేంద్రకొండపై కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి 15వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు జాతి ఎడ్లకు నిర్వహించిన బండలాగుడు బలప్రదర్శనలు పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ దారం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సబ్‌జూనియర్ ఎడ్ల పోటీలలో మొత్తం ఏడు జతల ఎడ్లు పాల్గొన్నాయి. కురిచేడు మండలం కాటంవారిపాలెంకు చెందిన కాటం రామిరెడ్డి ఎడ్ల జత 5,232 అడుగులు లాగి ప్రథమ బహుమతిగా రూ. 40 నగదును కైవసం చేసుకున్నాయి. వీమకుర్తికి చెందిన జంగా విజయభాస్కరరెడ్డి ఎడ్ల జత 5,200 అడుగులు లాగి ద్వితీయ బహుమతిగా రూ. 30 వేల నగదును గెలుచుకున్నాయి. దర్శికి చెందిన గానుగపెంట రాజశేఖరరెడ్డి ఎడ్ల జత 4,257 అడుగులు లాగి తృతీయ బహుమతిగా రూ. 25 వేలు, యర్రగొండపాలెం మండలం వీరాయపాలెంకు చెందిన దూదేకుల సుభాని, బాషా ఎడ్ల జత 4,253 అడుగులు లాగి నాల్గవ బహుమతిగా రూ. 20 వేలు, గొట్లం రంగసాయి వెంకటలక్ష్మి ఎడ్ల జత 3,800 అడుగులు లాగి ఐదో రూ. 15 వేల నగదు బహుమతిని సాధించారు. దర్శికి చెందిన గానుగపెంట రాజశేఖరరెడ్డి రెండో ఎడ్ల జత 3,259 అడుగులు లాగి ఆరవ బహుమతిగా రూ.10 వేలు, గొల్లవీడి చెందిన గొంగటి పుల్లారెడ్డి ఎడ్లజత ఏడో బహుమతిగా రూ.5 వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాణె వెంకటరెడ్డి, లింగారెడ్డి, సందిరెడ్డి వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, పాపిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం

తుదిదశకు

శాసనమండలి ఎన్నికల ప్రచారపర్వం ముగింపు దశకు చేరింది. పిడిఎఫ్, టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉద్యోగ, కార్మిక,ప్రజా పోరాటాలకు అండగా నిలబడుతు సమస్యల పై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ఉపాధ్యాయ,ప్రజాసంఘాల, ట్రేడ్ యూనియన్ల నేతలు విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున గెలిచిన ఎమ్మెల్సీలు నిజాయితీగా అనేక ప్రజా సమస్యల్లో భాగస్వామ్యం కావడంతో పాటు,రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించి, జాబ్ క్యాలండర్ ప్రకారం జాబులు ఇవ్వాలని, వ్యవసాయకూలీ, రైతాంగ సమస్యలు,ప్రజలపై పడుతున్న ఆర్‌టిసి, విద్యుత్ ఛార్జీలు, ఇతర అధిక ధరలను తగ్గించాలని చట్టసభల్లో నిలదీస్తున్న తీరును గురించి ఓటర్లకు తెలియజేస్తున్నారు. అదేవిధంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్స్, పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగ,కార్మికుల పోరాటాల్లో భాగస్వాములై అందరికీ అండగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల,ఉపాధ్యాయుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు.

ఇటీవల కాలంలో గంజాయి అక్రమ రవాణా బాగా పెరిగింది. విద్యార్థులు, యువత గంజాయికి బానిసలు అవుతున్న క్రమంలో పోలీస్ యంత్రాంగం తగు చర్యలు చేపట్టింది. గంజాయి, మత్తు పదార్థాల వల్లే కలిగే పర్యవసానాల గురించి వివరించడం కోసం 'సంకల్పం– డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం' అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ప్రస్తుతం సమాజంలో యువత భవిష్యత్తును ప్రశ్నిస్తున్న అంశం డ్రగ్స్ అని, గ్రామస్థాయిలో ఇది చొచ్చుకుపోతుందని, యువత డ్రగ్స్‌కు బానిసలుగా కావడం వల్ల వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోంది.

ఆరుతడి పంటలకు సాగునీటి కోసం అద్దంకి నియోజకవర్గ రైతులు, తాగునీటి కోసం యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు రోడ్డు ఎక్కి నిరసన తెలిపారు.గుండ్లకమ్మ, సాగర్ కాలువల పరిధిలో ఆరుతడి కింద మిర్చి, మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేసిన రైతులు సాగునీటి కోసం రోడ్డు మీదికి వచ్చి రాస్తారోకో చేశారు. మిర్చి, మొక్కజొన్న పంటలు చివరి దశలో ఉన్నాయని ఇలాంటి సమయంలో సాగునీరు అందకపోతే పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటూ ఇంకొల్లు రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గుండ్లకమ్మ ఎడమ కాలువ ద్వారా కొరిశపాడు, నాగులుప్పలపాడు మండలాల రైతులకు ఆరుతడి పంటలకు సరిపడా నీరందించాలని కోరారు.ఇప్పటికే పలుమార్లు గుండ్లకమ్మ మరియు జలవనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకున్న పరిస్థితి లేదని రైతులు తెలిపారు. పుల్లల చెరువు, యర్రగొండపాలెం మండలాల్లో డీప్ బోర్లు ఒట్టిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పొలాల్లోని వ్యవసాయ భూముల్లోని బోర్లు కూడా అడుగంటాయి. ప్రస్తుతం టాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా నిలిపి వేయడంతో ప్రజలు రోడ్డెక్కి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయినప్పటికీ పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిలువ ఉంచిన 605 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా చీరాల, పందిళ్ళపల్లిల్లో మూడు లారీల్లో తరలివెళుతున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

శాసనమండలి ఎన్నికల పట్టభద్రుల,ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున్న దొంగ ఓట్లు వెలుగుచూశాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధి ఓటర్ల జాబితాలో ప్రత్యక్షమయ్యాయి.స్థానికులు కాని వారి ఓట్లు అధిక సంఖ్యలో చేర్పించినట్లు వెల్లడయింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఇక్కడి ఓటర్ల జాబితాలో గుంటూరు, నర్సరావుపేట, బాపట్ల, నాగాయలంక,రేపల్లె తదితరప్రాంతాల వారికి చెందిన ఓట్లు గణనీయంగా చేర్చారు. బూత్‌ల వారీగా పరిశీలిస్తే ఒక్కొక్క బూత్‌లో 150 నుంచి 200 వరకు బోగస్ ఓట్లు వెలుగుచూశాయి. బోగస్ ఓట్ల నమోదుపై వామపక్ష పార్టీల నేతలు జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలోనూ అనర్హుల ఓట్లు అధికంగా వచ్చాయి. ప్రైవేట్ కళాశాలల్లో బోగస్ ఓట్లు చేర్చారు.